# పిచ్చితండ్రి

ఇలాంటి రోజొకటి నా జీవితంలో కూడా వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు!

జగన్మోహనరావుగారిని చూశాక - 'ఇలాంటి రోజు' ఏ తండ్రికీ రాకూడదని నేను మనస్ఫూర్తిగా కోరుకున్నాను కూడా!

జగన్మోహనరావు గారు మా ఇంటికి ఎదురుగుండా వున్న మేడలోనే వుంటారు. ఆయనకిప్పుడు అరవైఏళ్లు నిండాయి. కానీ మనసునిండా దిగుళ్లు వల్ల కావచ్చు - డెబ్భయ్యేళ్లు పైబడిన వారిలా కనిపిస్తారాయన.

ఆయనను ఎరిగున్నవాళ్లెవరూ, ఆయన మనసునిండా దిగుళ్లున్నాయని ఆయనే స్వయంగా చెప్పినా నమ్మరు గాక నమ్మరు!... ఆమాటకొస్తే జగన్మోహనరావుగారు కూడా ఎప్పుడూ తన మనసు విప్పి చెప్పుకున్నట్టు నాకు తెలీదు.

కానీ -

నాలో ఓ మూలెక్కడో చిన్నపాటి రచయిత వుండటం వల్లనైతేనేం, నేను బి.ఎ.లో సైకాలజీ కూడా చదవటం వల్లనైతేనేం, పదిహేను సంవత్సరాలుగా వారింటికి ఎదురుగా వుండటం వల్లనైతేనేం - ఆయన్ని శ్రద్ధగా సరిశీలించగలిగాను.... ఆయన మనోభావాల్ని నిశితంగా చదవగలిగాను!

జగన్మోహనరావుగారు సెక్రటేరియట్‌లో పనిచేసి - గొప్ప హోదాలో రిటైరయ్యారు... ఆయనకు ఇద్దరే కొడుకులు... ఇద్దర్నీ బాగా-బాగా ఏమిటి - బ్రహ్మాండంగా చదివించారు.. ఒకడు డాక్టరూ, మరొకడు ఇంజనీరూ కావాలన్న లక్ష్యంతో చదివించారు... భార్యాపిల్లల్ని ఒదిలిపెట్టి ఆయనొక్కరూ టూర్ మీదైనా పదిరోజులు వేరే వూళ్లో మకాం పెట్టిన సందర్భాలు కానీ, చదువు సంధ్యల నిమిత్తం పిల్లలైనా వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరాలు కానీ, కలిగిన దాఖలాలు లేవు! ఆయనా, పిల్లలూ అన్నదమ్ముల్లాగానో, స్నేహితుల్లాగానో వుండటమే నేను చూశాను తప్ప, తండ్రిగా ఆయనగారు అధికారం చెలాయించడంగానీ, పిల్లలుగా వాళ్లు భయభక్తులు ప్రదర్శించటంగానీ నేనెప్పుడూ చూళ్లేదు...

వాళ్ల పెద్దబ్బాయి సారధి నాలుగేళ్ళక్రితం 'ఎంబీబీఎస్' పాసయ్యాడు..

అతగాడి బుర్రలోనే ఆలోచన పేరుకొని వుందో, లేక స్నేహితులు ప్రోత్సహించారో

తెలియదు కానీ, ఓ రోజు హఠాత్తుగా తాను అమెరికా వెళ్లి 'ఎమ్మెస్' చదవాలనుకుంటున్నట్టు ప్రకటించాడు సారధి!.. అంతేకాదు, తాను అక్కడి యూనివర్సిటీలో సీటుకి 'అప్లయ్' చేసినట్టూ, త్వరలోనే సీటు రాబోతున్నట్టూ చెప్పాడు...

సారధి విదేశాలకు వెళ్ళటం జగన్మోహనరావ్‌గారికి మనసు పొరల్లో ఇష్టం లేకపోయినా అదేదో మహదవకాశమని అయినవాళ్లూ, ఆత్మీయులూ హర్షం వ్యక్తం చేసేసరికి తటస్థంగా వుండిపోయారు... ఆ తర్వాత మూడు నెలలకే బ్యాంక్‌లో అప్పు తీసుకుని సారధి అమెరికా ప్రయాణమయ్యాడు.

రాత్రి రెండు గంటలకు విమానం బయల్దేరుతుందనగా - మూడు గంటలు ముందే జగన్మోహనరావుగారు కుటుంబ సమేతంగా విమానాశ్రయానికి బయల్దేరారు... నేను వాళ్ళ హితైషిని కావటంవల్లా, టాక్సీలో చోటు వుండటంవల్లా నన్నుకూడా విమానాశ్రయానికి రమ్మని పిలిచారు జగన్మోహనరావుగారు...

సారధికి 'సెండాఫ్' చెప్పేందుకు విమానాశ్రయానికి చాలామంది వచ్చారు... వాళ్లంతా సారధి అదృష్టాన్ని మెచ్చుకుంటూ అభినందనలు అందచేస్తూంటే - ఏదో పనున్నట్టు పక్కకు వెళ్ళి జగన్మోహనరావుగారు మాత్రం కన్నీళ్లు పెట్టుకోవటం నేను గమనించాను.

అవును మరి!...

అబ్బాయి అమెరికా వెళ్ళటం అంటే అమ్మాయి అత్తవారికింటికి వెళ్ళటాన్ని మించిన బరువైన సన్నివేశం!.... మళ్లీ ఎప్పటికి రాగలుగుతాడో?.... రావాలన్నా మాటలు కాదు... మూటలు కవాలి మరి!... తండ్రి రక్తాన్ని పంచుకునీ తల్లి పేగు తెంచుకునీ పుట్టిన కన్నబిడ్డ అమెరికా వెళ్తాడంటే - ఇక బంధువుగానో, స్నేహితుడిగానో మారిపోతాడు... చుట్టం చూపుగా రెండేళ్ళకో మూడేళ్లకో ఓసారి ఇండియా వస్తాడు. స్నేహితుల్నీ బంధువుల్నీ పలకరించినట్టుగా తల్లినీ తండ్రినీ పలకరిస్తాడు... అంతే!.. బహుశా అందుకేనేమో ఆరోజున సారధి విమానం ఎక్కుతూంటే జగన్మోహనరావు గారూ ఆయన భార్యా పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని మునిపంటితో నొక్కిపట్టి అతి ప్రయాసమీద ఆపుకోవటం - నన్నూ కదలించింది!

"ఏమిటి రావుగారూ! చిన్న పిల్లవాడిలా ఏమిటా కన్నీళ్లు?..... మీ వాడు గొప్పగా పెద్ద చదువుల కోసం విదేశాలకు వెడుతూంటే గర్వంతో పొంగిపోవాలి కానీ - దిగులుగా కన్నీళ్లు పెట్టుకుంటే ఎలా?" అని ధైర్యం చెప్పాలనుకున్న నాకూ గొంతు పెగల్లేదు....

విమానం ఆకాశంలోకి ఎగిరిపోయింది!... మేం ఇంటికి తిరిగివచ్చేశాం!... ఆ తర్వాత చాలా రోజులు జగన్మోహనరావుగారిల్లు కళావిహీనంగా కనిపించింది నాకు....

ఆయనా, ఆయన భార్యా వీధి బాల్కానీలో ఎదురెదురుగా కూర్చునేవారు. ఒకప్పుడు అలా వాళ్లు బాల్కనీలో కూర్చుని మాట్లాడుకుంటూంటే మధ్యలో ఇద్దరు పిల్లలూ వచ్చి వరస కలిపేవారామాటలకి!...ఏం మాట్లాడుకునే వారో నాకు వినిపించేది కాదు కానీ - పౌర్ణమి నాటి సముద్రపు పొంగులాంటి సంరంభమేదో అక్కడ కనిపించేది...! కానీ వాళ్ల పెద్దబ్బాయి వెళ్లిపోయాక చాలా రోజులు - బాల్కనీలో నిశ్శబ్దంగా కూర్చునే - వాళ్లు నాకు గాజు బొమ్మల్లా కనిపించేవారు!

సారధి యూనివర్సిటీలో చేరాక - జగన్మోహనరావ్‌గారికి ఫోన్ చేశాడు... అక్కడ అతనికేదో పార్ట్‌టైం ఉద్యోగం దొరకటంవల్ల ఇబ్బందేమీ వుండదని చెప్పాట్ట! నెలకోసారి అతను ఫోన్ చేసేవాడు... ఆ తర్వాత అక్కడి సంగతులన్నీ పూసగుచ్చినట్టు జగన్మోహనరావుగారు నాకు చెప్తూండేవారు. ఆయన చిరునవ్వుతోనే ఆ విషయాలు నాకు చెప్తున్నా - ఆ చిర్నవ్వు వెనకాల ఏదో గూడు కట్టుకున్న వేదన ధ్వనించేదని నేను ఖచ్చితంగా చెప్పగలను!....

రోజులూ, వారాలూ, నెలలూ గడచి పోయాయి. కొడుకు తాలూకు వియోగాన్ని - నెలకోసారి ఫోనులో మాట్లాడటం ద్వారా భరించటం నేర్చుకున్నారు జగన్మోహనరావు గారు... 'ఎమ్మెస్' అయిపోగానే అక్కడ అతనికి ఉద్యోగం కూడా వచ్చింది.... నెలకు ఏడెనిమిది వేల డాలర్లు జీతం ఇస్తారట!... అంటే మన కరెన్సీలో రెండు లక్షల పైచిలుకే!... అక్కణ్ణించి అప్పుడప్పుడు వచ్చే స్నేహితుల్తో తల్లికీ తండ్రికీ తమ్ముడికీ రకరకాల వస్తువులు కొని పంపేవాడు సారధి....

ఆమధ్య జగన్మోహనరావుగారి షష్ఠిపూర్తి జరిగింది....

"మీకు అత్యంత ఇష్టమైనది ఏదైనా కొనుక్కోండి" - అంటూ వెయ్యి డాలర్లు పంపించాడు సారధి!

"నాకు అత్యంత ఇష్టమైనది నువ్వే!... కానీ వెయ్యి డాలర్లకు నువ్వు రావుకదా!... అందుకని దాన్ని నీపేర ఇక్కడ బ్యాంకులో వేస్తున్నాను!" అని జవాబు రాశారు జగన్మోహనరావుగారు.

ఈ సంగతి నాకు చెప్పి ఆయన ఇలా అన్నారు -

"తన పిల్లలు వృద్ధిలోకి రావాలనీ బాగా సంపాదించుకోవాలనీ ప్రతి తండ్రీ కోరుకుంటాడు. అంత మాత్రం చేత తనకు పెట్టి పోషించాలన్న ఆశా-స్వార్థం ఏ తండ్రికీ వుండవు... అంతకంటే 'కులాసాగా వున్నారా నాన్నా?... ఆరోగ్యంగా తిరుగుతున్నారా?"

అని కన్నకొడుకు యోగక్షేమాలడిగినప్పుడు ఆ తండ్రి పొందే ఆనందానికి ఏ డబ్బుతోనూ విలువ కట్టలేమండీ!" - అలా అంటూంటే ఆయన కళ్లు చెమ్మగిల్లటం చూశాను.

రోజులు ఆ ప్రకారం ఓ మూసలో పోసినట్టు గడచిపోతూండగా - జగన్మోహనరావుగారి రెండోఅబ్బాయి రాజా ఇంజనీరింగ్ పాసయ్యాడు...

"ఇక్కడ పైచదువులకు మంచి అవకాశాలున్నాయి తమ్ముడూ! నాన్నగారు ఇష్టపడితే ఇక్కడ నీ చదువుకి నేను అన్నీ ఏర్పాట్లూ చేస్తాను" అంటూ ఓ ఉత్తరం రాశాడు సారథి.

అది చూడగానే రాజా ఆలోచనలు కూడా విదేశీయమైపోయాయి.

"నేనూ వెళ్లి అక్కడ చదువుకుంటాను డాడీ!" అన్నాడు రాజా.

"నువ్వు కూడా వెళ్లిపోతే ఎలారా?... పెద్దాడు వెళ్లిపోయినందుకే నాన్నగారు - పైకి చెప్పుకోలేకపోయినా లోలోపల ఎంతో అల్లాడిపోతున్నారు... ఇప్పుడు నువ్వు కూడా వెళ్లిపోతావా?" అని అడిగింది జగన్మోహనరావుగారి భార్య.

నెపాన్ని భర్తపైకి నెట్టేసిందన్నమాటేగానీ - ఆవిడ ఎంతగా ఆవేదన చెందుతున్నదీ నాకు తెలుసు!

ఎవరో పెద్దలు - బహుశా అనుభవజ్ఞులే అనుకుంటాను - సెలవిచ్చినట్టు కన్నవాళ్ళకు పిల్లలపై వుండే ప్రేమానురాగాల్లో వందో వంతైనా ఆ పిల్లలకు తమ తల్లితండ్రులపై వుండవేమో!

తల్లితండ్రుల నీడలో ఏ కొడుకైనా హాయిగా పెరిగి పెద్దకావాలనుకుంటాడు. తన భవిష్యత్తును పటిష్టంగా తీర్చిదిద్దుకోవాలనుకుంటాడు... ఆ తర్వాత తన బంగారు భవిష్యత్తులోకి భార్యామణిని ఆహ్వానిస్తాడు... అక్కడితో అతని జీవితం మరో మలుపు తిరుగుతుంది!... అప్పుడు తల్లి ఇటుకరాయితో సమానమవుతుందని ఖచ్చితంగా చెప్పలేను కానీ - పెళ్లాం మాత్రం పటిక బెల్లమే అవుతుంది.... తమ దాంపత్య వనంలోకి పూల మొక్కల వంటి పిల్లల్ని తీసుకొస్తుంది... అక్కడితో అతగాడికి తల్లితండ్రులు - కేవలం బంధుసమానులే అవుతారు! భార్యాబిడ్డలు మాత్రం ఆత్మబంధువులవుతారు! అసలు సృష్టి రహస్యమే అంత!

చివరకు జరిగిందేమిటంటే జగన్మోహనరావుగారి రెండో కొడుకు - రాజా కూడా ఓ సుముహూర్తాన విమానం ఎక్కి ఆకాశంలోకి ఎగిరిపోయి అమెరికాలో వాలిపోయాడు...

జగన్మోహనరవుగార్ని ఎరిగున్న మిత్రులు అంటూంటారు -

"ఆయనకేమండీ... అదృష్టవంతుడు.. రత్నాల్లాంటి పిల్లలు!... ఇద్దరు పిల్లలూ హాయిగా అమెరికాలో వున్నారు!" అని...

ఆ కామెంట్ విన్న జగన్మోహనరావుగారు మాత్రం ఏడవలేక నవ్వుతూంటారు... రెండో కొడుకు కూడా వెళ్లిపోయాక ఆయనా, ఆయన భార్యా మూగవాళ్లైపోయారు... ఎంతో సందడిగా కనిపించే వారిల్లు, శివుడులేని శిథిలాలయమైపోయింది... బాల్కనీలో ఎదురెదురుగా కూర్చుని - ఒకరి మూగ బాధను మరొకరు పంచుకుంటూంటారు.

వాళ్ల మనోవేదనను అర్థం చేసుకున్న వాణ్నికనుక - అలాంటి పరిస్థితి మరే తండ్రికీ రాకూడదని నేను మనస్ఫూర్తిగా కోరుకున్నాను.

కానీ...

ఆ దుస్థితి నాకే వస్తుందనీ - అలాంటి రోజును నా జీవితంలో నేనూ ఎదుర్కోవల్సి వస్తుందనీ కలలో కూడా వూహించలేదు...

శంకరం మాకు ఏకైక సంతానం!.. నాకూ, శారదకీ కూడా వాడంటే పంచప్రాణాలు!.. పెళ్ళయిన చాలా కాలానికి వరాలపంటగా పుట్టాడు. గారాల కూచిగా పెరిగాడు.... అదృష్టవశాత్తూ ఆర్థిక పరమైన లోటేదీ మాకు లేకపోవటం వల్ల డొనేషన్లు కట్టి ఇంజనీరింగ్ చెప్పించాను! డిగ్రీ చేతికిరాగానే.. ఊళ్లో ఉద్యోగం కూడా వచ్చింది... ఆరు వేలకుపైనే జీతం!... వచ్చే ఏడు పెళ్లికూడా చేయాలను కుంటున్నాం.

అయితే ఈ లోగా ఓ రోజు...

శంకరం ఆఫీసునుంచి వస్తూనే హుషారుగా చెప్పాడు -

"నాకు కాలిఫోర్నియాలో జాబ్ వచ్చింది" అని.

నా నెత్తిమీద పిడుగుపడినట్లయింది...!

"ఎలా వచ్చిందీ? ఎప్పుడొచ్చింది? అసలు అక్కడి ఉద్యోగానికి ఎప్పుడు అప్లికేషన్ పంపించావ్?" అంటూ నేను ప్రశ్నల వర్షం కురిపించకుండానే శంకరం తాపీగా చెప్పాడు-

"ఆమధ్య పేపర్లో అడ్వర్టైజ్‌మెంట్ వస్తే యదాలాపంగా నా బయోడేటా పంపించాను... తర్వాత ఆ కంపెనీవాళ్లు నన్ను టెలిఫోన్‌లోనే ఒకటి రెండుసార్లు ఇంటర్వ్యూ చేశారు... అప్పుడే రెండు నెలలయిపోయింది. ఉద్యోగం వస్తుందని నేను అనుకోలేదు! కానీ ఇవాళ పోస్టులో 'ఆర్డర్' వచ్చింది.. అర్జంటుగా పాస్‌పోర్ట్ పంపించమన్నారు. నేనక్కడికి వెళ్లేందుకు 'వీసా' వాళ్లే ఏర్పాటు చేస్తారట!... ఖర్చులన్నీ వాళ్లవే...! మూడేళ్లు కాంట్రాక్టు... ఆ తర్వాత మనిష్టం! వుంటే అదే కంపెనీలో వుండచ్చు... లేదంటే వచ్చేయచ్చు!"

"అయితే అక్కడకు వెళ్లటానికే డిసైడ్ చేసుకున్నావా?" - నా గొంతులోంచి వచ్చిన ఈ ప్రశ్న నూతిలోంచి వచ్చినట్టుగా నాకే అనిపించింది...

"వెడితేనే బావుంటుందని అందరూ అంటున్నారు.. నెలకు మూడువేల డాలర్లు జీతం! అంటే దాదాపు లక్షరూపాయలతో సమానం..."

"ఇక్కడ మాత్రం నీకు లోటేమిట్రా?.... నువ్ చేస్తున్నది కూడా మంచి ఉద్యోగమేగా! వచ్చే ఏడు ఏదో ప్రమోషన్ కూడా వస్తుందన్నావ్‌గా?" అడిగింది శారద....

"ఎన్ని ప్రమోషన్లువస్తే అంత సంపాదించగలుగుతాం?.... అయినా మూడేళ్లంటే ఎంతసేపు?... ఇట్టే తిరిగొస్తాయి!.... ఓ పది లక్షలు ఈజీగా వెనకేసుకురావచ్చు!"

వాడి ఉత్సాహం చూస్తే - కాలిఫోర్నియా వెళ్లటానికే మానసికంగా ప్రిపేర్ అయిపోయాడని నాకు అర్థమయింది....

నేనూ శారదా నిస్సహాయులమైపోయాం!... విదేశీ ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ శంకరమే చేసుకున్నాడు...

ఇంక మూడు రోజుల్లో ప్రయాణం....!

అంటే -

జగన్మోహనరావ్‌గారిలాగే, నేను కూడా ఎయిర్‌పోర్ట్‌కెళ్లి - మరో మూడు రోజుల్లో మా శంకరానికి కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పాలి....

జగన్మోహనరావ్‌గారి పిల్లలు వెళ్లిపోయినప్పుడే - ఆదృశ్యాన్ని చూసి నేను తట్టుకోలేక పోయాను... ఇప్పుడు మాకున్న ఒకే ఒక కొడుకు, ఎప్పుడు పడితే అప్పుడు రాలేనంత దూరం వెళ్లిపోతూంటే - ఎలా భరించటం?.... ఆ సన్నివేశాన్ని ఎలా ఎదుర్కోవటం?...

అయితే భగవంతుడు ఓ చక్కని రాజమార్గం చూపించాడు...! ఆ రోజు సాయంత్రం ఆఫీసు నించి రాగానే శారదకు చెప్పాను -

"చిన్న ఇబ్బంది వచ్చింది... ఎలా ఇప్పుడు?"

ఏమిటన్నట్టు చూసింది శారద నావైపు.

"ఎల్లుండి ఎలక్షన్లు కదా!... నాకు డ్యూటీ వేశారు... కర్నూలు వెళ్లాలి!" చెప్పాను.

అర్థం కాలేదు శారదకి.

"ఎల్లుండే కదా శంకరం అమెరికా వెడుతున్నది?... మరి నేనేమో రేపు రాత్రి కర్నూలు వెళ్లి ఎల్లుండి అక్కడే వుండాలి.... ఎలా?"

"సెలవు పెట్టచ్చుగా?" అక్కడే సూట్‌కేసు సర్దుకుంటున్న శంకరం సలహా యిచ్చాడు.

"ఎలక్షన్ డ్యూటీ కదా? శెలవు దొరకటం కష్టం!.... 'మెడికల్ లీవ్' పెట్టాలన్నా ఇప్పుడు కష్టమవుతుంది!" చెప్పాడు.

"పోన్లెండి! అర్థాంతరంగా అవాంతరాలు వచ్చిపడితే మీరుమాత్రం ఏం చేస్తారు?" అంది శారద...

★ ★ ★

నేను కర్నూలు నించి తిరిగి వచ్చేసరికి ఇల్లు బోసిగా కనిపించింది.

"శంకరం వెళ్లాడా?... సామాన్లు జాగ్రత్తగా ఎక్కించారా?" - రాత్రి భోజనం చేస్తూ అడిగాను.

"ఆ !... జాగ్రత్తగానే వెళ్ళాడు... వాడి ఫ్రెండ్స్ చాలామంది వచ్చారు ఎయిర్‌పోర్ట్‌కి!... మీరు రాలేదేమిటని అంతా అడిగారు?" చెప్పింది శారద....

ఆ తర్వాత అంతా నిశ్శబ్దం....

మరో రెండు రోజులు బరువుగా గడిచిపోయాయి.... మూడో రోజున నేను ఆఫీసు నుంచి రాగానే మంచినీళ్లు అందిస్తూ అడిగింది శారద -

"మీరు ఎలక్షన్ డ్యూటీకి కర్నూలు నిజంగానే వెళ్లారా?" అని.

నేను షాకయ్యాను...

"నేను వెళ్లలేదని నీకెలా తెల్సిందీ?" ఇంక దాచటం అనవసరమనిపించి అడిగాను...

"వినాయకుడి గుళ్లో పూజారి పురుషోత్తమరావుగారు చెప్పారు పొద్దున్న ...! మన శంకరం వెళ్లినరోజు రాత్రి మీరు చాలా సేపు గుళ్లో వున్నారటగా?" శారద సూటిగా చూసింది.

అంతవరకూ తెలుసుకున్నాక - ఇక అసలు సంగతి చెప్పటమే మంచిదనిపించింది...

"అవును! నాకు ఎలక్షన్ డ్యూటీ, కర్నూలూ అంతా అబద్ధం!... వాడు మనల్ని ఒదిలి వెళ్లిపోయే క్షణాల్ని నేను తట్టుకోలేనేమోనన్న భయంతో - అలా 'ప్లాన్' వేశాను... ఇంటి దగ్గర వుంటే ఎలాగా నన్ను ఎయిర్‌పోర్టుకి రమ్మని నువ్వు బలవంతం చేస్తావు... అందుకే- కర్నూలు వెడుతున్నట్టుగా మీతో అబద్ధం చెప్పి - ఇక్కడే లాడ్జిలో రూమ్ తీసుకుని గడిపాను... వాడి ప్రయాణం నాటిరాత్రి మాత్రం వినాయకుడి గుడికి వెళ్లాను...! వాడు కనీసం మూడేళ్లకైనా తిరిగి ఇండియారావాలనీ - ఆ దేశంలో వాడు ఆరోగ్యంగా, సుఖంగా వుండాలనీ ఆ దేవుడికి మొక్కుకున్నాను..."

నేనలా చెప్తూంటే నన్నో పిచ్చివాణ్ణి చూసినట్టు చూసింది శారద.

పదిరోజుల తర్వాత శంకరం ఫోన్ చేశాడు... ఆఫీసుకి!

"అమ్మ వుత్తరం రాసింది!... ఆ రోజు నువ్వు కర్నూలు వెళ్లలేదటగా!.. అమ్మ అన్ని వివరాలు రాసిందిలే!.. అయినా నీకేమైనా పిచ్చా?... మీ అందర్నీ వదిలి నేను అమెరికా వస్తుంటే ఎంతో మంది ఫ్రెండ్స్ కూడా సెండాఫ్ చెప్పటానికి వచ్చారు!... అలాంటిది... కన్నతండ్రివి... నువ్వు రాలేదంటే మరేమనుకోవాలి?''... అంటూ ఇంకా ఏదేదో మాట్లాడుతున్నాడు నాకేం వినిపించలేదు....

"నేను నిజంగానే పిచ్చివాణ్ణా' అనే ఆలోచన మాత్రం వచ్చింది...!

మర్నాడు పొద్దునే మళ్లీ వినాయకుడి గుడికి వెళ్లాను...

ఈ సారి... శంకరం ఇండియా తిరిగి రావాలని మొక్కుకోటానికి కాదు...

"రేపు ఎప్పుడో శంకరం పెళ్లిచేసుకుని - ఓ బిడ్డకి తండ్రయ్యాక - ఆ బిడ్డ చదువు వంకతోనో, ఉద్యోగం పేరుతోనో - కన్నవాళ్ళను వదిలి మరో దూరదేశం పోకుండా చూడుస్వామీ!'' అని ప్రార్థించడానికి !!!

*(ఈనాడు, ఆదివారం అనుబంధం..... 19-6-94)*

★ ★ ★